క్లుప్తంగా

మేకల దొంగకు రిమాండ్

దామెర : మేకలను దొంగతనం చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌కు చెందిన కందికొండ వికాస్ కుమార్ మరికొంత మందితో కలిసి డిసెంబర్ 24న మండలంలోని కోగిల్వాయికి కారులో వచ్చి మేకలను దొంగతనానికి పాల్పడ్డాడు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అప్పుడే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా వికాస్ కుమార్ పరారీలో ఉన్నాడు. కాగా దామెర శివారులోని డిస్నీల్యాండ్ పాఠశాల వద్ద బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న వికాస్ కుమార్‌ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా వివిధ పోలీస్ స్టేషన్లలో సుమారు 30 పైగా కేసులు, దామెర పోలీస్ స్టేషన్‌లో 4 కేసులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

పర్వతగిరి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మండలంలోని గుగులోతుతండాలో చౌటపల్లి సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వం తాలు, తరుగు పేరుతో రైతులను నిండా ముంచిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మద్దతు ధరతోపాటు సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భానోతు చందు నాయక్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మాసాని సువార్త, సొసైటీ సీఈఓ వెంకటయ్య, సెంటర్ ఇన్‌చార్జ్ కుమార్, కార్యదర్శి అరుణ, నాయకులు మాసాని యాకూబ్, వీరన్న, మోతీలాల్, సునీల్, భద్రాసింగ్, రమేశ్, చల్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల ధర్నా



కేయూ క్యాంపస్: ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైంస్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్ట్‌టైం అధ్యాపకులు కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. నూతన నియామకాల్లో పార్ట్‌టైం అధ్యాపకులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేందర్‌నాయక్ బాధ్యులు సంజీవ్, ఫణీంద్రకుమార్, నరేష్, మాధవి, సరిత, మయూరి, రమేష్, రాజేందర్, శ్రీధర్, సద్గుణ, కవిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌కు యూజీసీతో సంప్రదిస్తా

● బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు



కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల రెగ్యులరైజేషన్‌కు యూజీసీతో సంప్రదింపులు చేస్తామని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. తమను క్రమబద్ధీకరించాలని ఆరు రోజులుగా చేస్తున్న సమ్మెకు ధర్మారావుతో పాటు ఎమ్మార్పీఎస్ నేత మంద కుమార్‌మాదిగ, సీపీఎం జిల్లా కార్యదర్శి సూరం ప్రభాకర్‌రెడ్డి గురువారం సంఘీభావం తెలిపారు. రెండోగేట్ ఎదురుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మానవహారం నిర్వహించారు. అక్కడి నుంచి పరిపాలన భవనం వరకు ర్యాలీ కొనసాగింది. ఎమ్మార్పీఎస్ నాయకుడు కందికంట్ల విజయ్, డీవైఎఫ్ఐ తిరుపతి, రీసెర్చ్ స్కాలర్స్, వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. అనంతరం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు వంటవార్పు చేశారు.

కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా పరిశీలకుడిగా శ్రీనివాస్



హసన్‌పర్తి: కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా పరిశీలకుడిగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం కోమటిపల్లికి చెందిన నమిండ్ల శ్రీనివాస్‌ను నియమించారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నెరవేస్తారని అన్నారు. తన నియామకానికి సహకరించిన నేతలకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

మండల పరిషత్‌లో చెత్తాచెదారం



ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో పడేసిన చెత్త



పడేసిన ఖాళీ మద్యం సీసాలు

తుప్పపడుతున్న ప్రధాన గేట్లు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- దర్శనమిస్తున్న ఖాళీ మద్యం బాటిళ్లు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



శాయంపేట ఎంపీడీఓ కార్యాలయం

శాయంపేట : అన్ని గ్రామాలకు ఆదర్శంగా ఉండాల్సిన మండల పరిషత్ కార్యాలయం చెత్తాచెదారం, ఖాళీ మద్యం బాటిళ్లతో దర్శనమిస్తోంది.. గత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ప్రధాన గేట్లను అమర్చకుండా పక్కన పడేయడంతో అది తుప్పు పట్టి నిరుపయోగంగా దర్శనమిస్తోంది. శాయంపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం అనేక సమస్యలకు నిలయంగా మారింది. వివిధ పనుల నిమిత్తం మండలంలోని 24 గ్రామాల ప్రజలు వస్తూ, పోతుంటారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆఫీస్‌ను శుభ్రం చేసి, చెత్తను మాత్రం కార్యాలయ ఆవరణలోనే కుప్పలుగా పోస్తున్నారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ చెత్త చెదారంతో నిండిపోతోంది. అలాగే కార్యాలయానికి ప్రధాన గేటు లేకపోవడంతో రాత్రి వేళ మందుబాబులు మద్యం తాగి ఖాళీ సీసాలు అక్కడే పడేస్తున్నారు. ఖాళీ మద్యం సీసాలు కనబడిన ఎంపీడీఓ కార్యాలయ అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారు. కార్యాలయానికి పని కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇప్పటి వరకు అమర్చని గేటు..

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు నిర్మించారు. సీసీ పనులు చేపట్టినప్పుడు గేటును తీసి పక్కన పడేశారు. లోతైన ప్రదేశంలో పడేయడంతో అవి తుప్పు పడుతున్నాయి.అప్పటి నుంచి ఇప్పటి వరకు గేటును అమర్చిన దాఖాలు లేవు. ప్రస్తుతం ఎంపీడీఓ రోజు కార్యాలయానికి వచ్చి, వెళ్తున్న పేరుకుపోతున్న చెత్తా చెదారంపై దృష్టి సారించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంపీడీఓ కార్యాలయానికి ప్రధాన గేటు అమర్చి, చెత్తాచెదారం, ఖాళీ మద్యం సీసాలను తొలగించాలని, రాత్రి సమయాల్లో చీకటి లేకుండా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఎంపీడీఓ కార్యాలయంలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. సిబ్బంది చేత చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయిస్తాం. సీసీ రోడ్డు నిర్మాణంలో ప్రధాన గేటు తీసేసి పక్కన పెట్టారు. రాత్రి వేళ్లల్లో మందుబాబులు కార్యాలయం ఆవరణలో మద్యం తాగకుండా చర్యలు తీసుకుంటాం. సీసీ రోడ్డు నిర్మించడంతో ఎత్తు పెరిగి పాత గేట్లు పనికిరాకుండా పోయాయి. గేటు అమర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- ఫణిచంద్ర, ఎంపీడీఓ

క్వారీ యజమానిపై ఫిర్యాదు



కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు అందజేసి సమస్యను వివరిస్తున్న గుండేడు గ్రామస్తులు

కమలాపూర్ : మండలంలోని గుండేడు గ్రామస్తులు క్వారీ యజమాని మనోజ్‌రెడ్డిపై కలెక్టర్ ప్రావీణ్యకు గురువారం ఫిర్యాదు చేశారు. క్వారీ యజమాని మనోజ్‌రెడ్డి గ్రామ దేవాలయాల కోసం రూ.25 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చి కేవలం రూ.15 లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని కమలాపూర్ పర్యటనకు వచ్చిన కలెక్టర్‌కు వివరించారు. ఈ విషయాన్ని తాము ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే ఫోన్ చేయగా మనోజ్‌రెడ్డి ఎకౌశిక్‌రెడ్డితో అసభ్యంగా మాట్లాడి అవమానించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. మనోజ్‌రెడ్డి తన క్వారీలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, నియమాలు లేకుండా భయంకరమైన శబ్దాలతో రోజూ కొనసాగిస్తున్నారని తెలిపారు. దీంతో తమ పంటలకు నష్టం వాటిల్లుతోందని, పశువులు భయాందోళనలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణం పూర్తిగా కలుషితమై గ్రామస్తుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని, మనోజ్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

పంచాయతీరాజ్ వ్యవస్థతో అభివృద్ధి



ఆత్మకూరు: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

● అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్ రావు



ధర్మసాగర్: మాట్లాడుతున్న శ్రీనివాస్ రావు

ధర్మసాగర్ : పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటైన నాటినుంచి ప్రతి పల్లె, గ్రామంలో తాగునీరు, పారిశుద్ధ్యం, పచ్చదనం వంటి తదితర పనులతో గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని అదనపు డీఆర్‌డీఓ శ్రీనివాస్ రావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా జమ్మూ, కశ్మీర్‌లోని పహల్గం ఉగ్రదాడిలో మృతిచెందిన పర్యాటకుల ఆత్మ శాంతించాలని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ అనిల్ కుమార్ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారత్‌లో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు వల్లే గ్రామాల్లో అభివృద్ధికి ప్రాధాన్యత పెరిగిందని పేర్కొన్నారు. అదే విధంగా ధర్మసాగర్ గ్రామంలో పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై చేతులను ఏ విధంగా శుభ్రం చేసుకోవాలి అనే విషయాన్ని ప్రాక్టికల్‌గా ప్రజలకు సంబంధిత ఏఎన్ఎంల ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అనిత, పంచాయతీ కార్యదర్శులు, మహిళలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం పరిసరాల శుభ్రతపై పంచాయతీ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ విమల మాట్లాడుతూ.. గ్రామస్తులు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత, రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విక్రమ్‌కుమార్

ఐనవోలు : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ప్రారంభించి చల్లటి నీటిని తాగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా కార్యాలయానికి వివిధ పనులకు వచ్చే రైతులు, విద్యార్థులకు, ఇతరులు చల్లని తాగునీరు అందించి, దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ రాణి, ఏఆర్ఐ ఎం.మల్లయ్య, సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

● బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ

నర్సంపేట : ఈనెల 27న హనుమకొండ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 4, 5, 8వ వార్డుల్లో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశాలకు వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని తెలిపారు. సభ విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. పట్టణ ప్రజలందరూ సభకు తరలిరావాలని కోరారు. సమావేశాల్లో బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పార్టీ పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, క్లస్టర్ బాధ్యుడు బండి రమేశ్, మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్, వాసం సాంబయ్య, పుల్లూరి స్వామి, పెండెం వెంకటేశ్వర్లు, శివరాత్రి స్వామి, బండి ప్రవీణ్, 4వ వార్డు కమిటీ అధ్యక్షుడు సంపంగి సాలయ్య, సర్వాపురం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, 8వ వార్డు కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ గందె చంద్రమౌళి, మాజీ మార్కెట్ డైరెక్టర్ ఏడాకుల మల్లారెడ్డి, రవి, రాములు, గట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్చక ఉద్యోగ జేఏసీ డైరీ ఆవిష్కరణ



కొత్తకొండ దేవాలయంలో డైరీని ఆవిష్కరిస్తున్న అర్చకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ డైరీని అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్‌శర్మ గురువారం ఆవిష్కరించారు. ముందుగా వీరభద్రస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగబోయే సమావేశంలో అర్చకుల పదోన్నతులు, కారుణ్య నియామకాలపై చర్చించనున్నట్లు తెలిపారు. అర్చక ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. దేవాదాయ ఉప ప్రధాన అర్చకుడుకు రాజయ్య, ముఖ్య అర్చకుడు రాంబాబు, అర్చకులు శ్రీకాంత్, వినయ్‌శర్మ, శివకుమార్, శరత్ చంద్ర, సందీప్ శ్రావణ్, రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

లయశ్రీకి ఘన సన్మానం



లయశ్రీని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన అరూరి సుమలత-ప్రభాకర్‌ల కుమార్తె లయశ్రీ ఇటీవల ప్రకటించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంఎల్‌టీ గ్రూప్‌లో 991/1000 మార్కులతో స్టేట్ మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు లయశ్రీని శాలువాతో ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ కంజర్ల రమేష్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన లయశ్రీ పేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ కళాశాలలో చదువుతూ స్టేట్ మొదటి ర్యాంకు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. చదువులోనే కాకుండా స్పోర్ట్స్‌లోను రాణిస్తూ సాఫ్ట్‌బాల్ నేషనల్‌లో సిల్వర్ మెడల్ సాధించడం సంతోష దాయకం అన్నారు. మాజీ ఉప సర్పంచ్ బొల్లం ప్రకాశ్, మాజీ వార్డు సభ్యులు మంద రజిత, కాటబోయిన కుమారస్వామి, నాయకులు యాదగిరి, ఏలియా, వేంకటేశ్వర్ రావు, మోహన్, శివమణి, నాగరాజు, రాజుందర్, రాజు, ధర్మతేజ, అక్బర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించినట్లు కమలాపూర్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు. శనిగరపు భాస్కర్ బుధవారం ఉప్పల్ గ్రామానికి వెళ్లగా సుమారు రూ.20 వేల విలువైన సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. దీంతో భాస్కర్ గురువారం కమలాపూర్ పోలీసులను ఆశ్రయించగా, వారం క్రితం గ్రామస్తుల సహకారంతో ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను కేవలం అరగంట వ్యవధిలోనే పసిగట్టి భాస్కర్‌కు అప్పగించారు. తన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసి అప్పగించిన ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, పోలీసు సిబ్బందికి భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి

● మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మదన్‌కుమార్

నల్లబెల్లి : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏ కేటగిరీలోకి మార్చాని సీఎం రేవంత్‌రెడ్డిని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ పాలక మండలి మాజీ సభ్యుడు డాక్టర్ గుండాల మదన్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజు ఆధ్వర్యంలో మేడారం సమ్మక్క-సారక్క గద్దెల నుంచి చేపట్టిన మహాపాదయాత్ర మండలంలోని నల్లబెల్లి, రుద్రగూడెం గ్రామాల్లో గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా పాదయాత్రకు నాయకులు రుద్రగూడెంలో వలలతో ఘనంగా స్వాగతం పలికారు. పాదయాత్ర సందర్భంగా మదన్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ముదిరాజ్ కులస్తులకు సరైన రిజర్వేషన్లు అందడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలని, వెయ్యి కోట్ల రూపాయలతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తోడ్పాటు అందించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'ఎండలోనే ఎదురుచూపు'

● నిలువనీడ లేక ప్రయాణికుల ఇబ్బందులు



ఎండలో నిల్చున్న ప్రయాణికులు

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్‌లో నిలువ నీడలేక పోవడంతో ప్రయాణికులు ఎండలోనే బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన కూడలి అయినప్పటికీ బస్ షెల్టర్ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. జాతీయ రహదారి కావడంతో ఇక్కడి నుంచి అధిక సంఖ్యలో ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తాత్కాలిక సౌకర్యాలతో షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పహల్గాం ఘటన పిరికిపంద చర్య



శాయంపేట : కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పరకాల: బస్టాండ్ కూడలిలో రాస్తారోకో చేస్తున్న న్యాయవాదులు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి

శాయంపేట : జమ్మూ, కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిపిన ఉగ్రదాడి పిరికిపంద చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అభివర్ణించారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు ఇలాంటి దాడులతో భారతీయ స్ఫూర్తిని దెబ్బతీయలేరని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు చల్లా చక్రపాణి, చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి, నిమ్మల రమేష్, కొమ్ముల భాస్కర్, మారపల్లి రాజేందర్, రాజు, కట్టయ్య, కుమార్, జగన్, వీరన్న,రాము, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించాలి

ఆత్మకూరు : పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలని, ఇది హేయమైన చర్య అని తెలంగాణ తురక కాశ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ వలీ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉగ్రమూకలను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత పర్యాటలకుపై జరిపిన హత్యాకాండ అమానుషమని పేర్కొన్నారు.

పరకాలలో న్యాయవాదుల రాస్తారోకో

పరకాల : జమ్మూ,కశ్మీర్‌లో పర్యాటకులపై కాల్పులు జరిపి మారణహోమం సృష్టించిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తు పరకాల బస్టాండ్ కూడలిలో న్యాయవాదులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా..ఉగ్రవాదుల్లారా ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెండ్యాల భద్రయ్య, ఏజీపీ లక్కం శంకర్, సీనియర్ న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, ఒంటేరు రాజమౌళి, వి.చంద్రమౌళి, గంద్ర నరేష్‌రెడ్డి, మేరుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్‌పై కఠిన చర్యలు అవసరం..

జమ్మూ,కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ తాజొద్దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దాడికి కారణమైన ఉగ్రవాదులను గుర్తించి కఠినమైన శిక్ష విధించాలని, అదే విధంగా ఉగ్రవాదాన్ని పెంచిపోస్తున్న పాకిస్తాన్‌పై కఠినమైన నిర్ణయాలు తీసుకొని మరోసారి ఇలాంటి దాడులు జరుగకుండా చర్యలు తీసుకోవాలని తాజొద్దీన్ కోరారు.

నేడు నిరసన ర్యాలీ

జమ్మూ,కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ పరకాల పట్టణంలో నేడు(శుక్రవారం) సాయంత్రం నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు విశ్వహిందూ పరిషత్ పరకాల అధ్యక్షుడు పల్నాటి సతీష్, భజరంగ్ దళ్ కార్యదర్శి పేరాల రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు చేపట్టనున్న నిరసన ర్యాలీలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మేడేను విజయవంతం చేయండి



నర్సంపేట : మే 1న కార్మికులు మేడేను విజయవంతం చేయాలని సివిల్ సప్లయీ హమాలీ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో సంఘం మండల అధ్యక్షుడు ఓదెల కనకమల్లు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశానికి మునీశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మేడే విశిష్టతను వివరించారు. మే 1న కార్మికులందరూ ఎర్ర చొక్కా ధరించి ర్యాలీ, ఇతర కార్యక్రమాల్లో పాల్గొని స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. ఊరూరా జెండా ఎగరేయాలని సూచించారు. సమావేశంలో రవి, ముసుకు కుమా, అనిల్‌కుమార్, రమేష్, లక్ష్మయ్య, వెంకన్న, స్వామి, తదితరులు పాల్గొన్నారు.